# విశ్వనాథ కవిత్వం

- భైరవభట్ల కామేశ్వరరావు

(మూడవ భాగము)

## కవిత్వం

తన గొంతులోన నూగు నినాదము లపూర్వ
నినదితంబులు వచ్చి నిట్టవొడిచి
తన గుండెలోన డాగిన మెత్తనగు చోట్లు
భావరూపములంది పైకివచ్చి
తన సృష్టిలోన నుండిన క్రొత్త మాధుర్య
సీమలు క్రేళ్ళుగా జెంగలించి
తన ఆత్మ దా నెఱుంగని ఒక్క ఆనంద
పరిధి రేఖా స్వయంవ్యక్తి కలిగి
కను గొలుకులందు కన్నీళ్ళు గార్చి, మై గ
గుర్పొడవ...

తన గొంతులో ఊగిసలాడుతున్న నాదాలు అపూర్వమైన గానంగా బయటకి వచ్చి నిలిచినట్టుగా, తన గుండెలో దాగున్న మృదువైన స్థానాలు భావాల రూపాలు దాల్చి పైకి వచ్చినట్టుగా, తన సృష్టిలో నిండిన తీయని ప్రదేశాలన్నీ గంతులు వేస్తూ వచ్చి ఎదురుగా కనిపించినట్టుగా, ముందెప్పుడూ తెలియని పరమానందపు హద్దులని ఆత్మ తనకి తాను స్వయంగా తెలుసుకొన్నట్టుగా – ఇలాంటి అపూర్వమైన జలదరింపుతో, పులకరింపుతో కనుల చివరలనుండి కన్నీరు కారి, శరీరమంతా గొగుర్పొడిచింది.

గొప్ప కవులు, కవిత్వాన్ని గురించి కూడా కవిత్వం చెప్పడం పరిపాటి. విశ్వనాథ కూడా తన కావ్యాలలో చాలాచోట్ల ఆ పని చేసారు. ఆ చెప్పడం అన్యాపదేశంగా చెప్పారు, అంటే కవితాత్మకంగా చెప్పారన్న మాట. పైనున్న పద్యం అలాటి సందర్భాలలో ఒకటి.

ఋశ్యశృంగుడు లోకం తెలియకుండా పెరిగిన ముని కుమారుడు. అతను మొట్టమొదటిసారి మధుర గానాన్ని విన్నప్పుడు అతనిలో కలిగిన సంచలనాన్ని, స్పందననీ వర్ణించే పద్యమిది. కాని యిది కవిత్వానికి, ఆ మాటకొస్తే ఏ కళకైనా వర్తిస్తుంది. సహృదయుడైన ఒక రసజ్ఞునికి కళ ద్వారా కలిగే రస స్థితి యిలాగే ఉంటుందని విశ్వనాథ తీర్పు. అతను అలాంటి కవిత్వమే రాసారు.

అయితే, విశ్వనాథ చేసిన కవితా యాత్ర చాలా విచిత్రమైనది! భావ కవిత్వంతో మొదలైన అతని ప్రస్థానం, ఆంధ్ర జాతీయతతో పదునెక్కి, శిల్పసుందరమైన నాటకాలతో ప్రౌఢత్వాన్ని సంతరించుకొని, ఒక వంక గాఢమైన ఆత్మానుభూతి, మరో వంక అనన్యమైన అద్భుత కల్పనా శక్తి, రెండు పాయలుగా సాగి, ఈ గుణాలన్నీ అతని "సకలోహవైభవ సనాథ"మైన రామాయణ కల్పవృక్షమనే సాగరంలో విలీనమయ్యాయి.

కన్నెకాటుక కళ్ళు - చిన్ని నాథుని చూచి
కదులులాడిన వేళ - కందళించిన వేళ
ఆకాశమధ్యాన - అటనొక తెలిమబ్బు
మెరుపులా మెరిసిందిలే - వెలుగులో వొరిసిందిలే
తొలిచిన్ని చూలాలు - కొలసిగ్గు ప్రేమతో
విభుని చూచినవేళ - విన్నబోయిన వేళ
బఱపు విన్నులలోన - ఒక నీటి తెరమబ్బు
సంజలో తారిందిలే - జాలుగా మారిందిలే
తొలికాన్పు పసిపాప - సాకనేరని బాల
తెలవోయి పతిజూచి - కళవళించిన వేళ
తూరుపు కోనలో - తొంగలించిన మబ్బు
తెగ పరుగు లెత్తిందిలే - సొగసుల్లు వోయిందిలే

ఈ కవితలో విశ్వనాథ అచ్చమైన భావకవే! ఇంత లలిత లలితమైన గీతాన్ని విశ్వనాథ రాసారని మొదటిసారి తెలిసినప్పుడు నాకు ఆశ్చర్యం వేసింది! ఇలాంటి లాలిత్యం విశ్వనాథలో అరుదుగానే కనిపిస్తుంది.

నా ప్రాణములకు నీ పొగమబ్బుల
కేమి సంబంధమో! ఏను గూడ
పొగమబ్బునై కొండ చిగురు కోనలపైన
బురుజులపైని కొమ్మలకు పైని
వ్రాలిపోనే మధ్య వ్రీలిపోనే నేల
రాలిపోనే గాలి తేలిపోనే...

అన్నప్పుడు అతని భావుకతకి ఆత్మీయత తోడవుతుంది.

ఈ మనోహర వీణ వాయించలేక
చేతమున నెంతు నే నశిక్షితుడనంచు
నా లతాంగి విలోల నేత్రాంచలమున
గదలుచున్నది దాని రాగాల మెఱుపు

మనోహరమైన ఒక వీణని వాయించలేక "అయ్యో నేను అశక్తుడనైపోయానే!" అని మనసులో అనుకున్నంతలో, ఎదురుగా ఉన్న లతాంగి కనుల తుదలలో ఆ వీణ రాగాల మెఱుపు కదులుతూ కనిపించిందట! ఎంత లోతైన ఊహ! ఇది ముగ్ధమైన భావ కవిత్వం.

ఇలా విశ్వనాథ అచ్చమైన భావకవిగా మనకి కొన్ని కావ్యాలలో కనిపిస్తారు. ఈ భావుకతే తర్వాత జాతీయాభిమానం దిశగా మళ్ళి తెలుగు జాతి ప్రశస్తిని, పౌరుషాన్ని దశదిశలా ప్రతిధ్వనించింది. అయితే, విశ్వనాథని విశ్వనాథ చేసింది మాత్రం అతని అనన్య కల్పనాచాతుర్యం, శిల్ప నైపుణ్యం.

కల్పన అంటే ఊహ. ఒక కొత్త ఆలోచన, కొత్త దృక్కోణం. మనందరికీ తెలిసున్న విషయాల గురించి మనకి తెలీని ఒక కొత్త అంశాన్ని ఆవిష్కరించ గలగడమే కల్పనా చాతుర్యం. ఉదాహరణకి అశోకవనంలో సీతాదేవిని వర్ణించే యీ పద్యం చూడండి:

ఆకృతి రామచంద్ర విరహాకృతి, కన్బొమ తీరు స్వామి చా
పాకృతి, కన్నులన్ ప్రభు కృపాకృతి, కైశికమందు రామ దే
హాకృతి, సర్వ దేహమున యందును రాఘవవంశమౌళి ధ
ర్మాకృతి, కూరుచున్న విధమంతయు స్వామి ప్రతిజ్ఞ మూర్తియై

సీతాదేవి ఎలా ఉందీ అంటే, ఆమె ఆకారం రామచంద్రుని విరహానికి రూపంలా ఉందట. కనుబొమలేమో రాముని విల్లులా ఉన్నాయి. రాముని కరుణ కన్నులలో మూర్తికట్టింది. జడేమో రాముని శరీరకాంతితో మెఱుస్తోంది.

సీతాదేవి శరీరమంతా కూడా రఘువంశ చంద్రుడైన రాముని ధర్మం రూపుకట్టినట్టుగా ఉంది. ఆ కూర్చున్న విధానమేమో రాముని ప్రతిజ్ఞ మూర్తీభవించినట్టుగా ఉందట! ఎంత ఉదాత్తమైన ఊహ యిది! అంత ఎడబాటులో కూడా ఎప్పుడూ ఆ సీతారాములు కలిసే ఉన్నారన్న ఆలోచన గొప్పది. కనుబొమలని ధనుస్సుతో పోల్చడం మామూలే. అలాగే కురుల సౌందర్యాన్ని చెప్పడానికి వాటి నల్లని నిగనిగలు వర్ణించడమూ సామాన్యమే. కాని వాటిని సీత విషయంలో రాముని విల్లుగా, రాముని శరీర కాంతిగా అభివర్ణించడం అసామాన్యం. బాహ్య రూపంతో మొదలుపెట్టి, చివరికి ఆమె శరీరమంతా రాముని ధర్మానికి ప్రతిరూపంలా ఉందనడం, ఆమె కూర్చున్న తీరులో రాముని ప్రతిజ్ఞ కనిపిస్తోందనడం సాధారణ కవులు చెయ్యలేని ఊహ. ఇది సీతారాముల అద్వైతాన్ని నిరూపించే పద్యం. కల్పవృక్షం నిండా ఇలాంటి ఊహలే. అవి ఎంత విచిత్రంగా ఉంటాయో అంత సముచితంగా ఉంటాయి. అంత ఉదాత్తంగా ఉంటాయి.

శబరి పూలూ పళ్ళూ ఒక బుట్టలో జాగ్రత్తగా సర్ది, ఆ బుట్ట నెత్తిపై పెట్టుకొని రాముని దగ్గరకు వస్తుంది. అప్పుడా శబరి "*తుట్టతుదదాక ఎండిన చెట్టుకొమ్మ, శిఖరంబున యందు పుష్పించినట్లు*" ఉందిట. ఎంత సుకుమార కల్పన యిది!

విశ్వనాథ ఊహ సుకుమారమైన సన్నివేశాలలో సుకుమారంగా ఉంటుంది, విచిత్రమైన సన్నివేశాలలో అంత విచిత్రంగానూ ఉంటుంది.

శూర్పణఖ రామలక్ష్మణుల దగ్గరికి వచ్చినప్పుడు ఆమె గురించిన వర్ణన ఉంది. శూర్పణఖ అసలు రూపం మనకి తెలీదు. కాని, రామ లక్ష్మణుల దగ్గరికి వెళ్ళినప్పుడు చాలా అందమైన రూపంతోనే వెళ్ళింది. అలాటి అందమైన రూపాన్ని వర్ణించాలిక్కడ. అయితే అలా వర్ణించడం శృంగార రసాన్ని పోషించేదిగా ఉంటుంది. ఇక్కడ ఉన్నది రసాభాసమే కాని శృంగార రసం కాదు కదా. రామునికి ఆ అందాన్ని చూసి ఏవగింపే కలిగింది కాని మోజు కలగలేదు. మరి అలాంటి అందాన్ని ఎలా వర్ణించడం?

విరిసి మన్మథరాజు బిట్టావులించిన
ఆకాశమది రూపమందెననగ
విరి యమ్ముఁవాని విల్ ఫెళ్ళున విఱిగిన
పెనురావమది మూర్తి తనరెననగ
శివదృగగ్ని నిపీత నవ మన్మథ శరీర
శిఖి యుట్టి యాకృతి చెందెననగ
మన్మథ దహన సంభవ రతి బాష్ప సం
తాన మీ దేహంబు పూనె ననగ
నన్నియును గూడియే యిట్టులాయెనొక్కొ
యనగ, లోచన సహజ దర్శన సమగ్ర
శక్తి యుప సంప్రాతిచ్ఛిదా చటుల మగునొ
నా నొకానొక కామిని కానిపించె

ఈ పద్యాన్ని ఒకసారి చదివితే చాలదు. మళ్ళీ మళ్ళీ చదవాలి. చదివి అలాటి రూపాన్ని మనం ఊహించుకోవాలి. ఇందులో శూర్పణఖ శరీరాన్ని వర్ణించలేదు. కాబట్టి శారీరికమైన రూపమేదీ ఇందులో మనకి కనిపించదు. దీనిని మనం చదువుకుని ఊహించుకున్నప్పుడు, ఒక అభౌతిక భావన మన మనసులో కదలాడుతుంది. అది ఒక విచిత్రమైన సంచలనాన్ని, విరక్తిని కలిగిస్తుంది. శూర్పణఖని చూసిన రాముని మనసులో సరిగ్గా అలాటి భావనే కలిగి ఉండాలి! శూర్పణఖ పాంచభౌతికమైన అందాన్ని యిక్కడ వర్ణిస్తున్నారు. ఆకాశం, నీరు, నిప్పు, వాయువు ఇలా వీటన్నిటిలోనూ మన్మథునికి సంబంధించిన అంశ ఆమెలో ఉంది. అయితే అది ఎలాంటి అంశ? ఆకాశమేమో మన్మథుని ఆవులింతట! ఆవులింత జడత్వానికీ, నిద్రకీ చిహ్నం. అలాగే గాలిలో కదలికవల్ల యేర్పడే శబ్దం, మన్మథుని విల్లు "ఫెళ్ళు"మని విఱిగినట్టుందిట. మన్మథుని విల్లు కోరికని రేపేది. కానీ ఆ కోరిక యీమె విషయంలో విఱిగిపోతోంది. అంటే కోరికలు రేపే రూపమే అయినా ఇక్కడ అది కలగటం లేదు అని భావం. అలాగే ఆమెలోని అగ్ని మన్మథుని దహించిన అగ్ని స్వరూపం. ఆమెలోని నీరు మన్మథుడు కాలి బూడిదైనందుకు రతిదేవి కార్చిన కన్నీరు.

(మిగిలిన భాగాలు వచ్చే సంచికలలో)